క్లుప్తంగా

టెక్కలిలో ఉచిత నేత్ర వైద్యశిబిరం



విద్యార్థులకు సూచనలు అందిస్తున్న పారామెడికల్ విభాగం వైద్యులు ప్రతిభామాలిని, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలిలో సెంచూరియన్ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, గ్రామస్తులకు నేత్ర పరీక్షలు నిర్వహించి, నేత్ర ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం హరిప్రసాద్, సిబ్బంది తిరుపతిరావు, జయరామ్, పారామెడికల్ విభాగం వైద్యులు ప్రతిభామాలిని, ఈశ్వర్, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శలు..



విశ్రాంత ప్రిన్సిపాల్ అప్పలనాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లికి చెందిన బీఈడీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ గేదెల అప్పలనాయుడు కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు సోమవారం పరామర్శించారు. అప్పలనాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. అలాగే రామతీర్థం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త సుంకరి అచ్చిబాబు ఇటీవల ఆకస్మికంగా మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పిన్నింటి చినఅప్పలనాయుడు, నాయకులు కంచరాపు రాము, ఎరకయ్య, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు ఈ నెల 31లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150.. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 పరీక్షా రుసుం ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని పేర్కొన్నారు. వచ్చే నెల 21న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఓసీ, బీసీ అభ్యర్థులు 35, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 30 చొప్పున కనీస మార్కులు సాధించాల్సి ఉందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీళ్లు వేయించుకోకపోతే కేసులు



పెదతాడివాడలో తూనిక యంత్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

డెంకాడ: రేషన్ డిపో, ఎండీయూ వాహనాల్లో వినియోగిస్తున్న తూనికల యంత్రాలకు సీళ్లు వేయించుకోవాలని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఎం. దామోదరనాయుడు అన్నారు. లీగల్ మెట్రాలజీ, సివిల్ సప్లైస్ అధికారులు కలిసి మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ డిపోలు, ఎండీయూ వాహనాలను తనిఖీ చేశారు. పెదతాడివాడలో నిర్వహించిన తనిఖీలో గోధుమ పిండి స్టాకులో స్వల్ప తేడాలు గుర్తించారు. తూనికల యంత్రాలకు సీళ్ల గడువు ముగియడంతో కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లైస్ అధికారి రామారావు, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి.సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

నెల్లిమర్ల: నగర పంచాయతీలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ పోస్టులకు సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఖాళీగా ఉన్న 8 పోస్టులకు గత నెల 21న నోటిఫికేషన్ జారీ చేయగా ఏడుగురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.ఈ నేపథ్యంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ పాపయ్యరాజు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

విజయనగరం క్రైమ్: పట్టణంలోని సీఎంఆర్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కాంక్రీట్ లోడ్‌తో వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న వ్యక్తిని బలంగా ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని స్థానికులు 108 వాహనంలో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. అతని వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్యానికి మించి..



డీసీసీబీ కార్యాలయం

- రైతులకు పంట రుణాలు మంజూరు చేస్తున్న డీసీసీబీ
- ఏటా రుణ పరిమితి పెంపు

పూసపాటిరేగ: రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటూ, అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విరివిగా వ్యవసాయ రుణాలు మంజూరు చేస్తోంది. విత్తు నుంచి పంట విక్రయాల వరకు రైతుభరోసా కేంద్రాల ద్వారా తోడ్పాటు అందిస్తూ వ్యవసాయాన్ని పండగగా మార్చేసింది. సకాలంలో పంట రుణాలు ఇచ్చి అన్నదాతకు అండగా నిలుస్తోంది. బ్యాంకర్లకు ప్రభుత్వమే హామీ ఉంటూ రైతులకు పెద్ద ఎత్తున రుణాలు అందిస్తున్నారు. పూసపాటిరేగ, సవరవిల్లి డీసీసీబీ బ్రాంచ్‌ల పరిధిలో సుమారు 10,000 మంది రైతులు ఉన్నారు. వీరందరికీ పంట రుణాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో జిల్లా యంత్రాంగం, బ్యాంకర్లు చర్యలు తీసుకుంటున్నారు. పూసపాటిరేగ, సవరవిల్లి డీసీసీబీ బ్రాంచ్‌ల పరిధిలో గల పూసపాటిరేగ, వెంపడాం, కుమిలి, లంకలపల్లిపాలెం, పోలిపల్లి, భోగాపురం, డెంకాడ సొసైటీల పరిధిలో గల రైతులకు లక్ష్యానికి మించి మూడేళ్లుగా రైతులకు రుణాలు అందిస్తున్నారు. 2021–22 సంవత్సరంలో రూ.10.50 కోట్లు, 2022–23 సంవత్సరంలో రూ.9.5 కోట్లు, 2023–24 సంవత్సరంలో 9 కోట్ల రూపాయలను రుణాలుగా అందించారు. తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేస్తుండడంతో రైతులు రుణాలు తీసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

విరివిగా రుణాలు..



రైతులకు విరివిగా రుణాలు అందించేందుకు నిర్ణయించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉన్న రైతులందరికీ రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. లక్ష్యానికి మించి మూడు సీజన్‌లలో రైతులకు రుణాలు అందించాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి నెలాఖరు నాటికే లక్ష్యానికి మించి రుణాలు అందజేశాం.

– పైడి శ్రీలత, బ్రాంచ్ మేనేజర్, డీసీసీబీ బ్రాంచ్, పూసపాటిరేగ

యుద్ధానికి సిద్ధం కావాలి



మహిళలకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపీపీ అనూషారెడ్డి, తదితరులు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

భోగాపురం: రానున్న రోజుల్లో పేదలు, పెత్తందారులకు మధ్య జరగబోయే ఎన్నికల యుద్ధానికి సిద్ధం కావాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలిచి ఆయన్ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో 1323 మంది మహిళలకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఇళ్ల పట్టాల పేరుతో జగనన్న రాష్ట్ర వ్యాప్తంగా అక్కచెల్లెమ్మలకు లక్ష కోట్ల రూపాయల విలువైన ఆస్తులు పంపిణీ చేశారన్నారు. గతంలో ఏ ప్రభుత్వమైనా ఈ స్థాయిలో ఆస్తి పత్రాలు పంపిణీ చేసిందా.. అని ఎమ్మెల్యే అడుగగా, మహిళలు లేదని బదులిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 31 లక్షల మహిళలకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఇంటి పట్టాలను అందజేశారని చెప్పారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామంటూ ఓట్లు వేయించుకుని తీరా గద్దెనెక్కిన తర్వాత మహిళలను మోసం చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. టీడీపీ నాయకులు మహిళలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత సమాజంలో మహిళలకు గౌరవం పెరిగేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే ప్రతి పథకం మహిళల పేరుతో అమలు చేస్తున్నారన్నారు. అమ్మఒడి పథకం ద్వారా పిల్లల చదువులకు 50 లక్షల మంది తల్లుల బ్యాంక్ ఖాతాల్లో రూ. 30 వేల కోట్లు జమ చేశారని తెలిపారు. అదేవిధంగా 45 ఏళ్లు దాటిన అక్కచెల్లెమ్మలకు చేయూత పథకం ద్వారా 31 లక్షల మందికి రూ.14 వేల కోట్లు జమ చేశారన్నారు. విద్యాదీవెన, వసతిదీవెన కింద రూ.11 వేల కోట్ల రూపాయలు చెల్లించినట్లు తెలిపారు. ఈ మధ్య కాలంలో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి లోకం మాధవి నాలుగు మండలాల్లో తిరుగుతూ ఓటర్లను మభ్యపెడుతూ ప్లాస్టిక్ బకెట్లను పంపిణీ చేస్తున్నారని.. అయితే సీఎం జగనన్న అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధిదారులు బకెట్లు ఫ్యాక్టరీనే పెట్టుకోవచ్చన్నారు. అభివృద్ధితో పాటు బావితరాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని సంక్షేమ పాలన అందిస్తున్న జగన్ మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో సీఎంగా మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి, పడాల భానుప్రకాష్, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, బైరెడ్డి ఎర్రప్పలనారాయణ, తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, ఎంపీడీఓ చంద్రకళ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో నగర అభివృద్ధి

- కార్పొరేషన్ మేయర్ విజయలక్ష్మి
- స్టాండింగ్ కమిటీలో ప్రతిపాదించిన 40 అంశాలకు ఏకగ్రీవంగా ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ శెట్టి వీరవెంకట రాజేశ్వరరావు



సమావేశానికి హాజరైన కార్పొరేషన్ అధికారులు

విజయనగరం: నగర అభివృద్ధిలో ప్రతి ఒక్కరి సహకారం అవసరమని విజయనగరం కార్పొరేషన్ మేయర్ వి.విజయలక్ష్మి అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక కార్పొరేషన్ సమావేశ మందిరంలో మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. మొత్తం అజెండాలో పొందుపరిచిన 40 అంశాలకు ఆమోదం లభించింది. సమావేశంలో అజెండాలోని అంశాలను కమిటీ సభ్యులు చర్చించారు. . ఈ సందర్భంగా కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టి వీరవెంకట రాజేశ్వరరావు మాట్లాడుతూ.. నగరంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నేతృతంలో అభివృద్ధి శరవేగంగా సాగుతోందన్నారు. జరుగుతున్న అభివృద్ధిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఓ వైపు మౌలిక సదుపాయాలు కల్పిస్తూ.. మరోవైపు అభివృద్ధి, సుందరీకరణకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. వేసవి దృష్ట్యా బోర్ల మరమ్మతులకుమ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. నిర్మాణ దశలో ఉన్న వివిధ పనులు త్వరితగతిన పూర్తయ్యే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. . మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. అందరి సహకారంతో నగరంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అధికారుల పర్యవేక్షణలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగాలన్నారు. సమావేశంలో కమిషనర్ ఎం. మల్లయ్యానాయుడు, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు పట్నాన పైడిరాజు, బోనెల ధనలక్ష్మి, పిన్నింటి కళావతి, వివిధ భాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి..

- మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతి



కార్పొరేషన్ కమిషనర్ మల్లయ్యనాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు

విజయనగరం: పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, ఇటీవల చేపట్టిన సమ్మెలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రంగరాజు, జలగడుగుల కామేష్ కోరారు. ఈ మేరకు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రభుత్వం జారీ చేసిన జీఓలను విజయనగరం కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికులందరికీ వర్తింపజేయాలన్నారు. కార్మికులకు 21,000 రూపాయల వేతనం ఇవ్వడంతో పాటు సమ్మె కాలానికి కూడా జీతం మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం విడుదల చేసిన వెయ్యి రూపాయలు కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. మరణించిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. అలాగే మరణించిన కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని... విలీన పంచాయతీలలో పనిచేసే కార్మికులకు ఆప్కోస్‌లో విలీనం చేయటంతో పాటు వారికి కూడా 21 వేల రూపాయల జీతం ఇవ్వాలని కోరారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో పలువురు యూనియన్ ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

- ప్రజోపయోగ సేవల శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ జి.దుర్గయ్య



సదస్సుకు హాజరైన ప్రజలు



మాట్లాడుతున్న ప్రజోపయోగ సేవల శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ గరికిన దుర్గయ్య

డెంకాడ: ప్రజలకు చట్టాలపై అవగాహన అవసరమని ప్రజోపయోగ సేవల శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్, జడ్జి గరికిన దుర్గయ్య అన్నారు. మండలంలోని రఘుమండ గ్రామంలో సోమవారం 'చట్టాలపై న్యాయ అవగాహన సదస్సు' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణా నేరమన్నారు. ఆడపిల్లలను ఒక చోట నుంచి మరో చోటుకు తరలించి సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు వినియోగించరాదన్నారు. బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు చోటుచేసుకుంటాయని.. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యా శిక్షార్హులని తెలిపారు. కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్‌ను ఆశ్రయించాలన్నారు. ప్రజోపయోగ సేవల్లో ఏమైనా నష్టం జరిగితే పరిహారం పొందేందుకు శాశ్వత లోక్‌అదాలత్‌ను ఆశ్రయించాలని సూచించారు. ఆర్‌ఐ అనూష మాట్లాడుతూ.. జనన, మరణ ధ్రువపత్రాలు పొందాలంటే తప్పనిసరిగా సకాలంలో నమోదు చేసుకోవాలన్నారు. వివాహాలను కూడా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గూడేల విష్ణుమూర్తి, ఈఓపీఆర్‌డీ పి.శంకర్ జగన్నాథం, ఎంపీటీసీ సభ్యుడు అట్టాడ మునలినాయుడు, గ్రామ సచివాలయ, పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సీజ్ చేసిన మద్యంసీసాలు ధ్వంసం

పూసపాటిరేగ: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా పట్టుబడిన మద్యం సీసాలను ఎస్సై ఎ. సన్యాసినాయుడు ఆధ్వర్యంలో సోమవారం ధ్వంసం చేశారు. ఎస్పీ దీపికాపాటిల్ ఆదేశాల మేరకు 28 కేసులలో పట్టుబడిన 528 మద్యం సీసాలను ధ్వంసం చేసినట్లు ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోతో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

భోగాపురం: మండలంలోని పోలిపల్లి కూడలి వద్ద సోమవారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో పోలిపల్లి గ్రామానికి చెందిన నిమ్మల రమణ అనే వ్యక్తి నుంచి 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రవికుమార్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్: ఉగాది పురస్కారాలకు (2024) వివిధ రంగాల్లో ప్రతిభ కలిగిన వ్యక్తుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్ ఈఎస్ఎస్. నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, వృద్ధులు, దివ్యాంగుల సంరక్షణ, విద్య, వైద్యం, సాహిత్యం, సంగీతం, నృత్యం, కళలు, క్రీడలు, కరాటే, యోగా గురువులు, కర్షకులు, ఆధ్యాత్మికం, నాటకం, తదితర రంగాల్లో సేవలందిస్తున్న వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఏప్రిల్ 7న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో పురస్కారం అందజేస్తామన్నారు. వివరాలకు 96523 47207 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విజేతలకు బహుమతుల పంపిణీ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

డెంకాడ: మండలంలోని జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో 72 గంటల పాటు నిర్వహించిన హ్యాకథాన్ హ్యాక్‌ట్రియాడ్ ఈవెంట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సోమవారం బహుమతులు అందజేశారు. సామ్‌సంగ్ ట్యాబ్, రూ. 10 వేల నగదు చొప్పున అందించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన పర్పుల్ టాక్ హెచ్‌ఆర్ మేనేజర్ గైకా రామారావు మాట్లాడుతూ, వ్యక్తిత్వాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలి, సహకార అభ్యాసన, సాధానాల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శశి ఇంజినీరింగ్ కళాశాలల కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ శ్రీనివాస శర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ చైర్మన్ పి.శ్రీనివాసరావు, సెక్రెటరీ కె.శివరామకృష్ణ, వైస్ ప్రిన్సిపాళ్లు తమ్మినేని హరిబాబు, కేవీ నరసింహం, ప్లేస్‌మెంట్ డీన్ జి.ప్రకాష్‌బాబు, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు పక్కా ఏర్పాట్లు



మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూకరాజు

నెల్లిమర్ల: సాధారణ ఎన్నికల నిర్వహణకు సెక్టోరియల్ అధికారులు, పోలీసు అధికారులు సిద్ధం కావాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.నూకరాజు తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై నియోజకవర్గంలోని సెక్టోరియల్, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 12 నుంచి 15వ తేదీ మధ్యలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశముందన్నారు. ఈ లోగా అధికారులు తమ సెక్టార్ పరిధిలోని ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని సూచించారు. సదరు అధికారులకు తప్పనిసరిగా వాహన సదుపాయం ఉండాలని, ఆ దిశగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లను పూర్తి స్థాయిలో పరిశీలించి సౌకర్యాలు ఉన్నదీ, లేనిదీ చూసుకోవాలన్నారు. సదుపాయాలు లేకపోతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి. ధర్మరాజు, ఎంపీడీఓ జి. రామారావు, భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ, నెల్లిమర్ల ఎస్సైలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సేవలు వెలకట్టలేనివి



బదిలీ సిబ్బందితో ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, తదితరులు

- బదిలీ అయిన ఏఆర్ పోలీస్ అధికారులకు వీడ్కోలు

విజయనగరం క్రైమ్: శాంతి భద్రతల పరిరక్షణలో సాయుధ పోలీసు అందించిన సేవలు ఎనలేనివని ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ యూనివర్స్ అన్నారు. జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో పనిచేసి, ఇతర జిల్లాలకు బదిలీ అయిన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ బి.రమణమూర్తి, ఆర్ఎస్సైలు ఎల్.శ్రీనివాసరావు, నారాయణరావు, రామకృష్ణ, బి.ప్రసాదరావు, నీలిమ, కేశవరావు, అక్షయకుమార్‌లను సోమవారం సాయంత్రం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఆర్ డీఎస్పీ యూనివర్స్ మాట్లాడుతూ.. జిల్లాలో శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలుగకుండా.. అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. ముఖ్య వ్యక్తుల భద్రత, మోటారు ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్, వెల్ఫేర్, స్పెషల్ పార్టీస్, హెడ్ క్వార్టర్ విధులను సక్రమంగా నిర్వహించారని కొనియాడారు. బదిలీ జరిగిన ప్రాంతంలో కూడా మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు టి.శ్రీనివాసరావు, ఎన్.గోపాలనాయుడు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

- సీఐ వెంకటరావు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు

విజయనగరం క్రైమ్: ఇటీవల కాలంలో జిల్లాలో బైక్ దొంగతనాలు జోరందుకున్నాయి. దీంతో జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఈ మేరకు ఎస్పీ దీపిక ఆదేశాల మేరకు వన్‌టౌన్ సీఐ బి. వెంకటరావు ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం రాత్రి పట్టణంలోని పలు ప్రాంతాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, పార్కింగ్ చేసే బైక్‌లకు పెట్రోల్ , హ్యాండిల్ లాక్స్ వేసుకోవాలన్నారు. అదేవిధంగా సెల్లార్లలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సై జె.తారకేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.